# నాస్తిక దేవుడు

చంద్రం

"నీకు దేవుణ్ని చూడాలని వుందా?''

''అదేం ప్రశ్న? దేవుణ్ని చూడాలని ఎవరికుండదు?''

''నాస్తికులకుండదేమో''

''దేవుడు కనిపించకపోవటం వల్ల దేవుని అస్తిత్వంపై వాళ్లకి విశ్వాసం కుదరటం లేదు. అందుకే వాళ్లు నాస్తికులయ్యారు. దేవుడే కనుక కనిపిస్తే నాస్తికులంతా ఆస్తికులైపోతారు''

''దేవుడి అస్తిత్వాన్ని విశ్వసించే ఆస్తికులంతా దేవుణ్ని చూడగల్గుతున్నారా మరి?''

''ఎవరి అనుభవం వారిది. నా వరకు నేను ఆస్తికుణ్ణయి వుండి యింత వరకు దేవుణ్ని చూడలేకపోయాను''

''ప్రయత్నలోపమా?''

''ఎంత మాత్రం కాదు. దేవుడి కోసం నేను వెతకని చోటు లేదు. చెయ్యని ప్రయత్నం లేదు. ఎన్ని దినాలు ఉపవాసం వున్నానో, ఎన్ని రాత్రులు జాగారం చేశానో లెక్క లేదు''

''నేను చూపిస్తాను దేవుణ్ని''

''నిజంగానా?''

''నిజంగానే. కాని ఒక్క షరతు''

''దేవుణ్ని చూపిస్తానంటే నిప్పులో దూకమన్నా సిద్ధమే''

''అంత పని చెయ్యక్కర్లేదు. నేను రమ్మన్న చోటికి వస్తే చాలు''

''వస్తాను''

''మధ్యలో వెనుదిరగకూడదు''

''ఆ దేవుడి మీద ఒట్టు''

''అయితే రా...''

★★★

''ఆ అరుగు మీద ఏం కనిపిస్తోంది?''

''ఒక వృద్ధురాలు. ఒంటి మీద సరిపడ బట్ట లేక చలికి వణికిపోతోంది''

''నీ ఒంటి నిండా దుస్తులున్నాయి. పైగా పైన ఒక శాలువా కప్పుకున్నావు!''

''నిజమే! ఈ శాలువా లేకపోయినా నాకు చలి వెయ్యదు. తీసి ఆ వృద్ధురాలికి కప్పుతాను''

''నువ్వు శాలువా తన మీద కప్పుతోంటే ఆ వృద్ధురాలు నీవంక చూసిన చూపు గమనించావా?''

''గమనించాను''

''మాట్లాడే శక్తి లేక చూపులతోనే తన భావాన్ని వ్యక్తం చేసింది''

''నిజమే''

★★★

''అటు చూడు- హోటల్ ముందు పేదరాలి చంకలోని పసిబిడ్డ ఆకలికి కంకటిల్లిపోతోంది''

''అవును''

''పేదరాలి రొమ్ముల్లో పాలు లేవు. చేతిలో డబ్బులు లేవు. కాని, హోటల్లో పాలున్నాయి. పాలు పడితే ఆ పసిబిడ్డ ఆకలి తీరుతుంది. ఏడుపు ఆపుతుంది. ఏమంటావు?''

''నిజమే. నా జేబులో డబ్బులున్నాయి. ఓ గ్లాసుడు పాలు కొని ఆ పసిబిడ్డకు పట్టిస్తాను''

''పాలు తాగిన పసిబిడ్డ బోసి నవ్వు చూశావా? వెన్నెల విరిసినట్లు లేదూ- ఆ పేద తల్లి చేతులెత్తి నమస్కరిస్తోంది క్షీరదాతవైన నీకు- గుర్తించావా?''

''గుర్తించాను''

★★★

''ఇటు చూడు- నెత్తురు మడుగులో పడి కొట్టుకుంటున్నాడీ మనిషి''

''ఏదో వాహనం ఢీకొని వుంటుంది''

''చూసి తల తిప్పుకుపోతున్నారుగాని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు''

''నిజమే. పట్టించుకుంటే రేపు ఎన్నో చిక్కులు వస్తాయి. అందుకే తప్పుకుపోతున్నారు''

''రేపెప్పుడో రాబోయే చిక్కులకు జడిసి చావు బతుకుల్లో వున్న తోటి మనిషిని గాలికి ఒదిలెయ్యటం మానవత్వం అనిపించుకుంటుందా?''

''అనిపించుకోదు. ఇతన్ని నేనాదుకుంటాను. దగ్గర్లో వున్న ఆసుపత్రిలో చేర్పిస్తాను''

''చూశావా- ప్రమాదం నుంచి బయటపడిన ఆ వ్యక్తి చెమ్మగిల్లిన కన్నులు ప్రసరిస్తోన్న చల్లని చూపులు?''

''చూశాను''

★★★

''దేవుడు కనిపించాడా మరి?''

''ఏడీ?''

''నాక్కనిపించాడు''

''ఎక్కడ?''

''శాలువా కప్పి తనను చలి బాధ నుండి కాపాడిన వ్యక్తిలో దీనజన బాంధవుణ్ని చూసింది వృద్ధురాలు. ఆమె చూపులో అదే భావం నాకు కనిపించింది. తన బిడ్డ క్షుద్బాధను తీర్చిన వ్యక్తిలో ఆర్తత్రాణ పరాయణుణ్ని గుర్తించింది పేదరాలు. అందుకనే చేతులు జోడించింది. ప్రమాదం నుండి తనను రక్షించిన వ్యక్తిలో సాక్షాత్తు ఆపద్బాంధవుణ్ని దర్శించగలిగాడు ఆ మనిషి. అందుకనే ఆర్ద్ర



నయనాలతో తన కృతజ్ఞతలు సమర్పించుకున్నాడు''

''అంటే?''

''అర్థం కాలేదా? ఆ ముగ్గురూ నీలోనే దేవుణ్ని చూడగలిగారు. ఉపవాసాలుండి, జాగారాలు చేసి, గుడుల్లోనో, కొండలపైనో , గుట్టలమీదో వెదికి కనిపించలేదని నువ్వు అనుకుంటున్న ఆ దేవుణ్ని వాళ్లు నీలోనే - అంటే మనిషిలోనే చూశారు''

''మనిషిలో దేవుణ్ని చూడటమా?''

''అవును. ప్రతి మనిషిలోనూ దైవాంశ వుంటుంది. నిద్రాణమై వుండే ఆ దైవాంశను అవసరానుకూలంగా మనిషి మేల్కొల్పాలి. అలా మేల్కొల్పగలిగిన వాడే మానవుడు. అతడే దేవుడు. నాస్తికుల దేవుడు!''

''అయితే నాస్తికులు కూడా దేవుణ్ని గుర్తిస్తారన్నమాట''

''తప్పకుండా గుర్తిస్తారు. కాని, మీరు కొలిచే విగ్రహాలలో నాస్తికులకు దేవుడు కనపడడు. మానవుల్లోనే వాళ్లకి దేవుడు దర్శనమిస్తాడు. ఒక మహాకవిగారేమన్నారో తెలుసా?- పరుల కష్టాలు చూసి కలత చెందే దయార్ద్ర హృదయుల కనుకొలకులలో కన్నీటి బొట్టు రూపంలో పుడుతూ వుంటాడట భగవంతుడు. ఎంత చక్కటి నిర్వచనం!''

''ఇంతకీ నువ్వెవరు స్వామీ?''

''నేనొక నాస్తికుణ్ని''

★